# ఆచార్యపరంపరానుసంధానము- కృతజ్ఞతాసమర్పణము

నమ్మాళ్వార్ లోకమునకై అందించిన ఈ "తిరువాయ్ మొళ్ళి" దివ్య ప్రబంధము కాలక్రమేణ మరుగుపడగా, నమ్మాళ్వార్ల కటాక్షముతోనే మరల దానిని ప్రకాశింపఁజేసినవారు శ్రీమాన్ నాథమునులు. ఆ నాథమునుల నుండి ఆయన శిష్యులైన పుండరీకాక్షులు, వారినుండి వారి శిష్యులైన శ్రీరామమిశ్రులు, వారినుండి శ్రీమాన్ యామునమునులు, వారినుండి పరంపరానుగతముగా  పెరియనంబి, వారినుండి భగవద్రామానుజులు పొందేరు. భగవద్రామానుజుల నుండి శ్రీమాన్ గోవిందభట్టర్ గారికి, వారినుండి శ్రీమాన్ పరాశరభట్టర్ స్వామికి, వారి నుండి నంజీయర్ గారికి ఈ ప్రబంధము అందించబడినది. నంజీయర్ స్వామి నుండి వారిశిష్యులైన నంబిళ్ళై గారు పొందేరు. ఆ నంబిళ్ళై గారి శిష్యులలో ముఖ్యులు వడక్కు తిరువీధి పిళ్ళై, పెరియవాచ్చాన్ పిళ్ళై, ఈయుణ్ణి మాధవర్ అనువారు. వీరు నంబిళ్ళైగారి వద్ద ఈ గ్రంథలబ్ధి పొందేరు. వడక్కుతిరువీధి పిళ్ళై పుత్రులలో ఒకరైన అళగియ మణవాళ పెరుమాళ్ నాయనార్ అనువారు ఆచార్యహృదయము అను గొప్ప గ్రంథమును ఈ తిరువాయ్ మొళ్ళికి అంతరార్థ భావములను వివరిస్తూ రచించేరు.

ఈయుణ్ణి మాదవర్ గారి నుండి పరంపరానుగతముగా ఈయుణ్ణి పద్మనాబర్ కు, వారినుండి నాలూర్ పిళ్ళైకు, వారి నుండి నాలూరాచ్చాన్ పిళ్ళై, వారినుండి తిరువాయ్ మొళ్ళిప్పిళ్ళై స్వామికి, వారినుండి మణవాళమహామునులకు ఈ ప్రబంధము సంక్రమించినది.

ఈ తిరువాయ్ మొళ్ళి ప్రబంధమునకు వ్యాఖ్యానగ్రంథములు అనేకములు పూర్వాచార్యులు కృప చేసి యున్నారు. భగవద్రామానుజుల శిష్యులైన తిరుక్కురుగై పిరాన్ పిళ్ళాన్ అనువారు "ఆరాయిరప్పడి" అను గ్రంథమును రచించిరి. ఆరాయిరప్పడి అనగా 6000 గ్రంథమని అర్థము. ఒక గ్రంథమునకు 32 అక్షరములని భావము. నంజీయర్ ఒంబదినాయిరప్పడి(9000 గ్రంథము), అళ్ళగియ మణవాళ జియ్యర్ "పన్నీరాయిరప్పడి" (12000 గ్రంథము),

పెరియవాచ్చాన్ పిళ్ళై "ఇరుపత్తు నాలాయిరప్పడి" (24000 గ్రంథము) రచించేరు. వడక్కు తిరువీధి పిళ్ళై గారు నంబిళ్ళై గారి ఉపన్యాములను "ముప్పత్తారాయిరప్పడి (36000 గ్రంథము) అను పేరున గ్రంథస్థము చేసేరు . ఈ 36000 గ్రంథమునకే "ఈడు" అనియూ భగవద్విషయమనియూ వ్యవహరించెదరు. తిరువాయ్ మొళ్ళి ప్రబంధమునకు గల వ్యాఖ్యానములలో అత్యంత ప్రసిద్ధమైనది ఈ మహద్గ్రంథము. ఈ గ్రంథములను కాలక్షేపరూపముగా ఆచార్యులు శిష్యులకు పరంపరానుగతముగా అనుగ్రహించుట సంప్రదాయము. మణవాళమహాములు ఈ భగవద్విషయ కాలక్షేపము అనుగ్రహించు సమయమున, శ్రీరంగనాథుడు స్వయముగా చిన్న పిల్లవాని వలె వచ్చి కాలక్షేప గోష్ఠి లో పాలుపంచుకొని మణవాళమహాముల "తనియన్" శ్లోకమైన "శ్రీశైలేశ దయాపాత్రమ్..." అను శ్లోకమును అనుగ్రహించి అంతర్ధానము చెందేరట. ఆ విధముగా పరమాత్మ నమ్మాళ్వార్లకు ఉపదేశించిన ప్రబంధము తిరిగి మణవాళమహాముల ద్వారా పరమాత్మకే చేరి, గురు శిష్య వలయము సంపన్నమైనది.ఈ తిరువాయ్ మొళ్ళి ప్రబంధమునకు మణవాళమహాములు ప్రమాణ తిరట్టు ఒక వ్యాఖ్యానగ్రంథమును ప్రసాదించియున్నారు అది కాక వారు తిరువాయ్ మొళ్ళి నూత్తందాది అను తిరువాయ్ మొళ్ళి సారమును తమళపాశుర రూపమున రచించియున్నారు. వేదాంతదేశికులు సంస్కృతమున ద్రమిడోపనిషత్ అనియు తాత్పర్య రత్నావళి అనియూ ఈ గ్రంథమునకు సంగ్రహార్ధమును సంస్కృతశ్లోక రూపమున కృపఃజేసియున్నారు. ఇట్లు ఎందరో మహానుభావులు ఈ ప్రబంధరహస్యాలు లోకానికి అందించి కృపఃజేసి యున్నారు. గ్రంథవిస్తరణభీతిచే వారి వివరములన్నియు ఇచ్చట ప్రస్తుతించుట జరుగుట లేదు. క్షమించవలయును.

ఇక ఈ గ్రంథము, తద్వ్యాఖ్యానములును కూడ హిందీ, తెలుగు, కన్నడ, సంస్కృతాది భాషలలో అనువదింపబడినవి. ఇందు తెలుగు భాష యందు అనువాదములు కేవలము అర్థ,

తాత్పర్యమును మాత్రము అందించిన వచన గ్రంథములు, పద్యానువాదములే కాక సవ్యాఖ్యానముగా నున్న అనువాదములును, విమర్శనాత్మక వ్యాసములును కూడ కలవు.

ఆచార్యహృదయమునకు కందాడై శేషాచార్యులవారి అనువాదము సారతమము, అత్యంత ప్రఖ్యాతము అయిన గ్రంథము.

తెలుగు భాషలో పద్యానువాదములలో మేడేపల్లి వేంకటరమణాచార్యుల వారిది ముఖ్యమైనది. వారే కాక శ్రీమాన్ మరంగంటి శేషాచార్యులవారు, శ్రీమాన్ మాడభూషి శేషాచార్యులవారు, శ్రీమాన్ మాడభూషి మఠమ్ వేంకటాచార్యులుగారు మొదలైన పండితప్రకాండులు పద్యానువాదములు వెలయించి యున్నారు. ఇవికాక కేవలము కోయిల్ తిరువాయ్ మొழி యను పేర ప్రసిద్ధమైన తిరువాయ్ మొழி యందలి కొన్ని ముఖ్య పాశురములకు అనువాదము ప్రసాదించిన వారును యున్నారు.

వచనానువాదములయందు శ్రీమాన్ పాల్వంచ తిరుమల గుదిమెళ్ళ వేంకట లక్ష్మీ నృసింహాచార్యులవారు, శ్రీమాన్ కిడాంబి వేంకట నృసింహాచార్యులు వారు శ్రీమాన్ తె.కం. గోపాలాచార్యస్వామివారు(తిరువాయ్ మొழி సారసంగ్రహము), నేలటూరి భక్తవత్సలమ్ గారు, శ్రీమాన్ కె. టి. ఎల్. నరసింహాచార్యులవారు మొదలైన మహానుభావులు తమ తమ అనువాదగ్రంథములు ప్రసాదించియున్నారు. శ్రీమాన్ అణ్ణంగరాచార్యులవారి విమర్శనాత్మక వ్యాసములు, కవిశాబ్దిక కేసరి శ్రీమాన్ న.చ. రఘునాథాచార్య స్వామివారి వ్యాస, ప్రసంగములు, తె.కం.గోపాలాచార్యస్వామి వారి ఉపన్యాసములు కూడా ప్రకటింపబడియున్నవి.శ్రీమాన్ తె.కం. గోపాలాచార్యస్వామి వారు శ్రీమాన్ సింహగిరి స్వామివారి శిష్యులు. వీరు ఆంధ్రదేశమున సంప్రదాయ పరిరక్షణకు ఇతోధికముగా కృషి చేసి, కులపతులుగా ప్రసిద్ధులై తెలుగునాట శ్రీవైష్ణవ గణమునకు ప్రాతఃస్మరణీయులైనవారు.

ఇంతియ  గాక ఈ గ్రంథముపై తమిళమునందలి వ్యాఖ్యానగ్రంథములకు అనువాదములను శ్రీమాన్ కాండూరి కృష్ణమాచార్యులవారు, శ్రీమాన్ మాడభూషి రామానుజాచార్యులవారు మున్నగు మహానుభావులు అనువాదములు ప్రసాదించియున్నారు.

ఈ ప్రబంధమునకు అతి ముఖ్యమైన వ్యాఖ్యాన గ్రంథమైన "ఈడు" అనబడు భగవద్విషయమునకు తెలుగు అనువాదము శ్రీమాన్ శ్రీభాష్యమ్ అప్పలాచార్యుల పుత్రికామణియునూ, శిష్యురాలునూ అయిన శ్రీమతి కరి తిరువేంగళమ్మగారు ప్రసాదించేరు. వీరు భగవద్విషయ గ్రంథముపై అత్యంత ప్రీతి కలిగి, తెలుగు దేశములో ఆ ప్రబంధబహుళ ప్రచారమునకు ఎంతయో కృషిచేసి యున్నారు. శ్రీమాన్ శ్రీభాష్యమ్ అప్పలాచార్యులుగారు ఆంధ్రదేశములో సుప్రసిద్ధులైన పండితులుగా, ఉపన్యాసకులుగా పేరుపొందిన మహామహోపాధ్యాయ బిరుదాంకితులు. వీరునూ శ్రీమాన్ తె.కం.గోపాలాచార్యస్వామి వారి శిష్యులే. వీరే కాక ఇంకనూ ఎందరో ఆంధ్రదేశమున శ్రీవైష్ణవసంప్రదాయసముద్ధరణకు కృషి చేసినవారు, ఇంకనూ చేస్తున్న వారు ఎందరే ఉన్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారు, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరంగరామానుజ జీయర్ స్వామివారు, శ్రీశ్రీశ్రీ త్రిదండి రామచంద్రజీయర్ స్వామివారు,  శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామివారు మొదలైన జీయర్ స్వామి వార్లు, శ్రీమాన్ న.చ. రఘునాథాచార్యస్వామి వారు(వీరు ఇప్పుడు కీర్తి శేషులు), శ్రీమాన్ కందాడై వేంకటాచార్యులవారు(వీరు ఇప్పుడు కీర్తిశేషులు),శ్రీమాన్ ఉడయవర్లు  స్వామివారు వంటి పండిత ప్రకాండులు, మహానుభావులూ ఎందరో  తెలుగునాట భగవద్విషయగ్రంథము పాదుకొనడానికి, ప్రాకి పల్లవించడానికి మూలకారకులై ఈ ప్రబంధాన్ని కాలక్షేపరూపమున కృపఁజేయుచున్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరంగరామానుజజీయర్ స్వామివారు, మఱుగు పడిపోవుచున్న పెద్ద భగవద్విషయ గ్రంథములను(మూలము తో

బాటు అన్ని వ్యాఖ్యానములు కలిసి యున్న గ్రంథమును పెద్ద భగవ్విషయగ్రంథములని వ్యవహరించుదురు) ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి పునర్ముద్రించి ప్రకాశింపఁజేసిరి. ఈ నాడు తెలుగునాట శ్రీవైష్ణవలోకము వీరందరికీ ఎంతయో ఋణపడియున్నది. వారందరికీ శత సహస్ర నమస్సులు.

శ్రీభాష్యమ్ అప్పలాచార్యుల వారి శిష్యులైన శ్రీభాష్యమ్ శ్రీనివాసాచార్యులవారు అనేక మంది శిష్యులకు భగవద్విషయ కాలక్షేపము అనుగ్రహించి యున్నారు. వారి వద్ద కొద్ది పాటిగా సంప్రదాయ విషయాలను గ్రహించిన దాసుడి చేత, వారే దిశానిర్దేశముచేసి ఈ ప్రకృత ప్రయత్న కల్పనము గావించేరు. వారి చరణకమలములకు సవినయముగా ఈ ప్రయత్నాన్ని దాసుడు శతసహస్ర నమఃపూర్వకముగా సమర్పించుకొనుచున్నాడు.

కాని ఈ ప్రయత్నములో దాసుని అజ్ఞానము వలన అనేక దోషములు, జరిగి యుండును. పాఠకులు, భాగవతులు సహృయతతో మన్నించి మంగళా శాసనములు కృపఁ జేయవలసినదిగా అనేకానేక దండప్రణామములు చేసికొని దాసుడు అభ్యర్థిస్తున్నాడు.

ఈ ప్రయత్నములో దాసునికి మాతృ సమానులు, అనేక విధముల దాసుని జీవితగమనానికి ప్రేరకులు అయిన కరి తిరువేంగళమ్మగారి భగవద్విషయము తెలుగు అనువాద గ్రంథాలను విస్తృతముగా పరిగణించు కొనుట జరిగినది. పరమపదములో ఉన్ననూ ఆమె ఆశీస్సులు, అనుగ్రహము దాసునిపై ఎల్లప్పుడూ ఉండుననీ, దాసుడిని నడిపిస్తూ ఉంటాయనీ దాసుని ప్రగాఢ విశ్వాసము. వారికీ, మా అన్నగారైన ఆమె భర్త శ్రీమాన్ వేంకట నరసింహాచార్యులవారికి శత సహస్ర మస్సుమాంజలులు.

దాసుని అమ్మగారికి, నాన్నగారికి ఆళ్వార్లు అనినా, వారి గ్రంథములనినా అత్యంత ప్రీతి. దాసుడిని పరమపదమునుండి ఆశీర్వదించి, నడిపించమని వారిని ప్రార్థిస్తూ అనేకానేక దండప్రణామములు దాసుడు సమర్పించుకొను చున్నాడు.

ఈ ప్రయత్నములో ఎన్నో విధాల సహకరించిన చి. వరదరాజనకు, చి. మాధురికి ఆ ఆళ్వార్ల కృప ఎప్పుడూ ఉండాలని దాసుడు ప్రార్థిస్తున్నాడు.

ఇంకా ఈ ప్రయత్నములో దాసుడికి చేయూత నిచ్చి, ప్రోత్సహించిన శ్రీమాన్ శ్రీభాష్యమ్ శ్రీనివాస గారికీ, శ్రీభాష్యమ్ జగన్నాధాచార్యులగారికీ, మా సీతక్కకూ ఇంకనూ సహాయ, సహకారములందించి ప్రోత్సహించిన సమస్త భాగవతులకూ దాసుడు కృతజ్ఞతాపూర్వకమైన దండప్రణామములు సమర్పించుకొనుచూ వారి
మంగళాశాసనములనభ్యర్థించుకొనుచున్నాడు.

అడియేన్

ఎస్.కె.వి. రామాచార్యులు రామానుజదాస (బెంగుళూరు)

భక్తామృతమ్ విశ్వజనానుమోదనమ్

సర్వార్థదమ్ శ్రీశఠగోపవాఙ్మయమ్

సహస్రశాఖోపనిషత్సమాగమమ్

నమామ్యహమ్ ద్రావిడవేదసాగరమ్.

మాతాపితాయువతయః తనయావిభూతిః

సర్వమ్ యదేవ నియమేన మదన్వయానామ్

ఆద్యస్య నః కులపతిః వకుళాభిరామమ్

శ్రీమత్ తదంఘ్రియుగళమ్ ప్రణమామి మూర్ధ్నా

కాశ్యపాన్వయ సంజాతమ్ శరణ్యార్య పదార్చితమ్

వైరాగ్య జలధిమ్ వందే రంగరామానుజమ్ మునిమ్

వాధూలాన్వయ భాష్యకారతనయమ్ శ్రీరాఘవార్యాశ్రితమ్

శ్రీరామానుజదేశికద్వయకృపాలబ్ధాగమాంతద్వయమ్

న్యాయేవ్యాకరణేష్వలంకృతిలయే వేదాంతయుగ్మే సమమ్

శ్రీమద్వేంకట రామదేశికమహమ్ విద్వాంసమార్యమ్ భజే

వాధూలాన్వయ వార్ధిశీతకిరణమ్ కోదండరామాత్మజమ్

శ్రీరామానుజ సింహశైలకృపయా లబ్ధాగమాంతద్వయమ్

స్థానాచార్యపదోన్నతిమ్ ద్రవిడభాషాసారసంపాదకమ్

శిష్యానేకయుతమ్ ప్రసన్నహృదయమ్ శ్రీవేంకటేశమ్ భజే

రామాయణరహస్యజ్ఞమ్ రమ్యవాక్య విశారదమ్

అనంతగుణసంఘాతమ్ అప్పలార్యమహమ్ భజే

కౌండిన్యాన్వయ భాష్యకారతనయమ్ శ్రీ అప్పలార్యాశ్రితమ్

నాథద్వంద్వ పదాశ్రితమ్ చ సతతమ్ సంసేవ్య లక్ష్మీసఖమ్

ఆంగ్లద్రావిడసంస్కృతాంధ్ర బహుభాషాకోవిదమ్ ధీనిధిమ్

వేదాంతద్వయ తత్త్వ శాస్త్రవిదుషమ్ శ్రీశ్రీనివాసమ్ భజే.

---

********************